భద్రత కల్పించాలి..



కోల్‌కతాలో జూనియర్ మహిళా వైద్యురాలిపై జరిగిన పాశవిక సంఘటన అత్యంత బాధాకరం. అన్ని రంగాల్లో ఎదుగుతున్న నేటి సమాజంలో ప్రాణాలు పోసే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా? మేము పనిచేసే పీహెచ్‌సీ గ్రామానికి దూరంగా ఉంది. నైట్‌వాచ్‌మెన్ లేరు. రాత్రి సమయాల్లో మహిళా ఉద్యోగులు విధులు నిర్వహించాలంటే భయంగా ఉంటోంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి పీహెచ్‌సీల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ వై.కల్యాణి, వైద్యురాలు, కొళిగాం పీహెచ్‌సీ, ఇచ్ఛాపురం మండలం



బాధ్యులను శిక్షించాలి



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలు హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కంచిలిలో నిరసన ర్యాలీ చేశారు. పాఠశాల నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా స్థానిక రైల్వేస్టేషన్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవ హారం చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. -కంచిలి

క్లుప్తంగా

సంతబొమ్మాళిలో రాష్ట్రమంత్రి పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: మండల కేంద్రమైన సంతబొమ్మాళి గ్రామంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం పర్యటించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథకంలోకి తీసుకొని వెళ్తానని అన్నారు. ఎంపీడీవో ప్రేమలీల, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు జీరు భీమారావు, మెండ అప్పారావు, కూశెట్టి కాంతారావు, అట్టాడ రాంప్రసాద్, సూరాడ దాసురాజు ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐగా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐగా నియమితులైన ఇ.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎన్.లక్ష్మణ విశాఖపట్నం వీఆర్‌కి బదిలీపై వెళ్లారు. విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస నుంచి శ్రీనివాస్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శాంతిప్రియ

కాశీబుగ్గ/పలాస: పలాస మండలం రెంటికోట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ డిపోలను జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారిణి, శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిప్రియ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలో ఉన్న సరుకులు, రికార్డుల్లో ఉన్న సరుకులను సరిచూశారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే తగిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఆమె పరిశీలించారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతిఒక్కరు సమయపాలన పాటించాలన్నారు. పిల్లలకు నిబంధనలకు అనుగుణంగా పౌష్టికాహారాన్ని అందించాలని చెప్పారు. సివిల్ సప్లయ్ డీటీ రవికుమార్, వీఆర్వో ప్రసాద్‌నాయుడు ఉన్నారు.

వినాయక ఉత్సవానికి పందిరిరాట



పందిరాట పూజలు చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాసలో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో శ్రీసిద్ధి వినాయక పూజా కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులను ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఏడాది కూడా ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఉత్సవ ప్రారంభానికి సూచికగా పందిరిరాట వేసే కార్యక్రమాన్ని శనవారం నిర్వహించారు. వచ్చేనెల ఏడు ంంచి 11వ తేదీ వరకూ ఉత్సవాలను నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, కమిటీ సభ్యులు సంపతిరావు జయంత్‌కుమార్, పి.వి.వైకుంఠరావు, సింగుపురం రాము, చింత మాధవరావు, కొంచాడ రాజ్‌కుమార్, లక్ష్మణ శ్రీరాములు, భగవాన్, బాబూరావు పాల్గొన్నారు.

కొర్లాంలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది

సోంపేట: వర్షాకాలంలో ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జెమ్స్ ఆస్పత్రి వైద్యులు సూచించారు. మండలంలోని కొర్లాం గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి జెమ్స్ ఆస్పసత్రికి తరలించారు. కార్యక్రమంలో జాగృతిసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి, జెమ్స్ ఆసుపత్రి సిబ్బంది శ్వేత, చిన్నారావు ఉన్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు!

- అనుమతులు లేకుండానే వెలుస్తున్న వైనం
- నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న వెంచర్లు
- ఇబ్బందులు పడుతున్న కొనుగోలుదారులు

ఇచ్ఛాపురం: పట్టణం, పల్లె ప్రాంతాలనే తేడాలేకుండా అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లను వేసి వినియోగదారులకు కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంటగడుతున్నారు. తరువాత వాస్తవాలు తెలుకొని కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం పరిసరాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ అనుమతులు లేకుండానే ప్లాట్లుగా విభజించి అడ్డగోలుగా అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద లేఅవుట్లు, వెంచర్లు వేస్తున్నారు. వెంచర్లలో దేవాలయాలు, బీచ్‌లు ఉన్నాయని, అలాగే పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, జాతీయ రహదారికి అనువుగా ఉంటుందని సంబంధిత వెంచర్ మ్యాప్‌లో చూపెడుతూ అందులో విభజించిన ప్లాట్లను లక్షలాది రూపాయలకు అమ్ముకుంటూ చాలామంది సొమ్ము చేసుకొంటున్నారు. వాస్తవంగా పట్టాభూముల్లో వెంచర్లు ఏర్పాటు చేసే స్థలాలు వ్యవసాయ భూములుగా, పారిశ్రామిక ప్రాంతాలుగా ఉండకూడదు. వ్యవసాయ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేయాలంటే మొదట వాటిని నివాస స్థలాలుగా మార్చుకోవాలి. గ్రామపంచాయతీ, లేదా మున్సిపాలిటీల నిబంధనల మేరకు వాటి అభివృద్ధి నిమిత్తం 10 శాతం పార్కు వంటి అభివృద్ధి నిమిత్తం విడిచిపెట్టాలి. అలాగే 30 అడుగుల రహదారి వాటికి అనుగుణంగా కాలువలు వంటివి నిర్మాణం చేపట్టి తరువాత సంబంధిత శాఖనుంచి అనుమతులు తీసుకోవాలి. ఒకవేళ లేఅవుట్లు వేసిన భూభాగం వ్యవసాయ భూభాగమైతే నాన్‌అగ్రికల్చర్ లాండ్ యాక్ట్ కన్వర్షన్ అనుమతులు పొందిఉండాలి. ఇటువంటి నిబంధనలు గాలికి వదిలేసి పెద్ద పెద్ద ప్లాట్లగా విభజించి అమ్మకాలు చేపడుతున్నారు. లేఅవుట్లు ఎకరం నుంచి పది ఎకరాల వరకు ఉన్నవే అధికంగా ఉన్నాయి. ఇటువంటి వెంచర్లు మున్సిపాలిటీలో పరిధిలో సైతం పదుల సంఖ్యలో వెలశాయి. ఇటువంటి వాటిలో పట్టాదారు



మున్సిపాలిటీ పరిధి స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం వద్ద వెలసిన అక్రమలేఅవుట్

పాస్‌బుక్ ఆధారంగా కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్లు జరిగేలా కొందరు, అనుమతులు వచ్చేస్తున్నాయని కొందరు, అనుమతులు పొందినట్లు కొందరు ప్రజలను నమ్మించి బ్రోకర్లను ఏర్పాటు చేసుకొని అమ్మకాలు సాగిస్తున్నారు. ఇలాంటి ప్లాట్లను కొనుగోలు చేసిన తరువాత వాటిలో నిర్మాణాలకు సిద్ధమైనప్పుడు అసలు నిజాలు బయటపడి కొనుగోలుదారులు నానాతంటాలు పడుతున్నారు. ఇటువంటి అనధికార లేఅవుట్లలో కొన్ని మున్సిపాలిటీ పరిధిలోని ఏఎస్‌పేటలో 39/1, 2, 3, 4 సర్వే నంబర్ గల 1.90 ఎకరాల లేఅవుట్, 21/9, 11, 12, 13, 16, 17 సర్వే నంబర్ గల 0.90 ఎకరాల లేఅవుట్, బెల్లుపడ 30/10,11 సర్వే నంబర్ గల 1.71 ఎకరాల లేఅవుట్, 4/2 సర్వేనంబర్ గల రెండు ఎకరాల లేఅవుట్, 37/1, 2, 3, 5, 6, 38/1పీ, 2పీ సర్వేనంబర్ గల పది ఎకరాల లేఅవుట్, 33/2, 3 సర్వేనంబర్ గల 3.66 ఎకరాల లేఅవుట్, 196/1 సర్వేనంబర్ గల 5.19 ఎకరాల రత్తకన్న లేఅవుట్‌లను మున్సిపల్ అధికారులు గుర్తించారు.

ప్లాట్లు కొనేముందు..

ఇంటిస్థలాలు కొనుగోలు చేసేముందు సంబంధిత యజమానుల పేరు రెవెన్యూ రికార్డులో సరిచూసుకోవాలి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీని పరిశీలించుకోవాలి. సంబంధిత భూభాగంపై ఏదైన వివాదం ఉందా లేదా అనేది నిర్ధారించుకోవాలి. కొనుగోలు చేస్తున్నది ప్రభుత్వ స్థలమా లేదా పట్టాదారుని స్థలమా అనేది సరిచూసుకోవాలి. వ్యవసాయ భూభాగమైతే నాన్‌అగ్రికల్చర్ లాండ్ యాక్ట్ అనుమతులు ఉన్నదీ, లేనిది తెలుసుకోవాలి.



ఏఎస్‌పేటలో అక్రమంగా వెలసిన లేఅవుట్

అక్రమ లేఅవుట్లు గుర్తించాం



అనుమతులు లేకుండా మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా వేసిన లేఅవుట్లను గుర్తించాం. వారికి నోటీసులు జారీచేశాం. ఇటువంటి అక్రమ లేఅవుట్లలో ఎవరైన ప్లాట్లు కొనుగోలు చేస్తే వాటికి రిజిస్ట్రేషన్లు జరగవు. మున్సిపాలిటీ పరిదిలో వెలసిన అనాధికార లేఅవుట్లలో మున్సిపాలిటీ నుండి ఎటువంటి డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్, మంచినీటి సౌకర్యాలు కల్పించబడవు. అనాధికార లేఅవుట్లు వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా. ప్రజలు లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసేముందు ఒకటికి రెండుసార్లు పరిశీలన చేసుకోవాలి...

– ఎన్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు మంత్రి, ఎమ్మెల్సీలకు ఆహ్వానం



కాశీబుగ్గ: మంత్రి అచ్చెన్నాయుడుకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న యాదవ సేవా సమితి ప్రతినిధులు



కవిటి:ఎమ్మెల్సీ రామారావుకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఉత్సవ కమిటీసభ్యులు

కాశీబుగ్గ: పలాస రైల్వే మైదానంలో ఈ నెల 26వ తేదీన జరగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు పలాస నియోజకవర్గ యాదవ సేవా సమితి సభ్యులు శనివారం ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, యాదవ, బీసీ జిల్లా కన్వీనర్ ఇప్పిలి జగదీశ్వరరావు, పశుసంవర్ధక శాఖ ఏడీ మట్ట రవికుమార్, జీడి కార్మికసంఘ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, వంకల కూర్మారావు, దడియాల నరసింహులు, కొరికాన శంకరరావు, బద్రి గోపాల్ ఉన్నారు.

ఎమ్మెల్సీకి..

కవిటి: కాశీబుగ్గ రైల్వేగ్రౌండ్స్‌లో నిర్వహించే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు హాజరుకావాలని ఉత్సవ కమిటీ సభ్యులు నర్తు రామారావును కోరారు. ఈ మేరకు కొత్తపుట్టుగలోని ఆయన నివాసంలో శనివారం కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.

గృహ నిర్మాణాల బాధ్యత అధికారులదే

- డీఎస్‌ఓ శాంతిశ్రీ

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అధికారులే తీసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న డీఎస్‌ఓ బి.శాంతిశ్రీ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో గృహ నిర్మాణ శాఖ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 1288 గృహాలకు గానూ 792 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను లబ్ధిదారులతో మాట్లాడి వంద రోజుల ప్రణాళికలో భాగంగా నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీల్లో మంచినీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు తప్పని సరిగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. తులసిగాం, ధర్మపురం గ్రామ పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈ భగీరథ దొళాయి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కె.విష్ణుమూర్తి, హౌసింగ్ ఏఈ దిలీప్ రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.రామరావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాంతిశ్రీ

లోక్‌అదాలత్‌పై ప్రచారం చేయాలి

కోటబొమ్మాళి: సెప్టెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌పై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అధికారులను ఆదేశించారు. స్థానిక కోర్టుహాల్‌లో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులతో లోక్‌అదాలత్‌పై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు. తహసీల్దార్లు ఆర్.అప్పలరాజు, జె.హరిబాబు, జి.లక్ష్మీనారాయణ, ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు, ఏఎస్‌బీ ఎస్‌ఐ కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జడ్జి ప్రసన్నలత

క్రీడా పోటీలకు సన్నద్ధంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు రూరల్: వచ్చే నెల తొమ్మిదో తేదీ నుంచి జరగనున్న గ్రిగ్స్ అండ్ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల కోసం అధికారులు, క్రీడాకారులు సిద్ధంగా ఉండాలని ఎంఈవో బి.వెంకటరరమణ అన్నారు. వజ్రపుకొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరగనున్న పోటీల్లో భాగంగా మొదటి రోజు గోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, పదో తేదీన నగరంపల్లి హైస్కూల్‌లో ఖోఖో, టెన్నిస్, 11న అక్కుపల్లిలో కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. పోటీలను విజయవంతం చేసేందుకు క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పి.గజేంద్ర, ఎస్.చంద్రశేఖర్, మోహన్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో వెంకటరమణ

క్షీణించిన పారిశుద్ధ్యం!

వజ్రపుకొత్తూరు: మండలంలో ప్రధాన వర్తక, వ్యాపార కేంద్రం పూండి. మూడు మండలాలకు ఇది వాణిజ్యంగా ఉంది. ఐతే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీల్లో వేలు పెట్టి అక్కడ సర్పంచ్‌లకు అవకాశం ఇవ్వకుండా చేయడంతో ఎక్కడబడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. వైఎస్సార్ కూడలి, చేపల మార్కెట్, గనియాబంద, గోపాల్ చెరువు పరిసరాలు, ఆటో స్టాండ్, బస్టాండ్, మూడు రోడ్లు కూడలి ప్రాంతాలు దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికే సీజనల్ వ్యాధులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్యం క్షీణించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పూండి వైఎస్సార్ కూడలి వద్ద పేరుకు పోయిన చెత్త

బాధ్యతలు చేపట్టిన మందస ఎస్‌ఐ



కాశీబుగ్గ: మందస పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా షేక్ ఖాదర్ బాషా శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని డీపీటీసీ పనిచేసి బదిలీపై ఇక్కడకు విచ్చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన బి.అనిల్‌కుమార్ సారవకోటకు బదిలీపై వెళ్లారు. ఏఎస్‌ఐ శేఖర్‌తో పాటు సిబ్బంది నూతన ఎస్సైకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుని భార్యకు డిపాజిట్ పుస్తకాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: మండలం కేధారిపురం గ్రామానికి చెందిన ఆశి దుర్యోధనరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ముగ్గురు అమ్మాయిలను, భార్యను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడే దుస్థితి ఏర్పడింది. దీంతో స్పందించిన స్నేహ బృందం స్నేహితుని కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. కేధారిపురం గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు శనివారం నగదు రూపంలో మృతుని భార్యకు రూ.20వేలు అందించగా, ముగ్గురు అమ్మాయిల పేరున పోస్టాఫీసులో రూ.60 వేలు ఫిక్సిడ్ డిపాజిట్ చేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



పలాస: ఇటీవల కురుస్తున్న వర్షాలతో పలు రోడ్లు పాడయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కాశీబుగ్గ-అక్కుపల్లి రోడ్డు గోతులమయంగా తయారైంది. పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ప్రధానమైన ఉద్దానం ప్రజలకు ఈ రోడ్డే ఆధారం. ప్రస్తుతం పూర్తగా పాడవ్వడంతో పాదచారులు, వాహనాదులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

- పలాస

నీట్ పీజీ పరీక్షల్లో నవీన్ ప్రతిభ



నవీన్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

టెక్కలి రూరల్: నీట్ పీజీ ఫలితాల్లో సంతబొమ్మాళి మండలం ఆకులసతివానిపేట గ్రామానికి చెందిన ఎర్నాగుల నవీన్ ప్రతిభ కనబర్చారు. ఆలిండియా స్థాయిలో 260వ ర్యాంకు సాధించినట్టు కుటుంబీకులు తెలిపారు. నవీన్ విశాఖపట్నం ఆంధ్రమెడికల్ కాలేజీలో ఎంబీబీస్ పూర్తి చేశాడు. పీజీ అనంతరం ఎండీ జనరల్ మెడిషన్ చేస్తానని తెలిపారు. తండ్రి శంకరరావు టెక్కలి పోలీస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి ఇందుమతి గృహిణి. కుమారుడి ప్రతిభపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

పందులు, పశువులను ఖాళీ స్థలాల్లో పెంచుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో విచ్చలవిడిగా రోడ్లపై, జనావాసాల మధ్యలో తిరుగుతున్న పందులు, పశువులను సంబంధిత యజమానులు ఖాళీ స్థలాల్లో పెంచుకోవాలని.. లేకుంటే కఠిన చర్యలు తప్పవని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో పందులు, పశువుల యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ..యజమానుల తీరుమారకపోతే రోడ్లపై తిరుగుతున్న పశువుల్ని పట్టుకుని సుదూర ప్రాంతాల్లో విడిచిపెడతామని హెచ్చరించారు. అంతేకాకుండా జరిమానా వేస్తామన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

గోకుల కృష్ణా..గోపాల కృష్ణా..



సంతబొమ్మాళి: శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చొక్కరవానిపేట పాఠశాల విద్యార్థులు



కోటబొమ్మాళి: దంత పాఠశాల వేడుకల్లో పిల్లలు



కవిటి: కవిటిలో ఉట్టికొట్టే పోటీలో బాలలు



టెక్కలిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో..



సోంపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉత్సవ సందడి

శ్రీకృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు కృష్ణుడు వేషంలో అలరించారు. ఉట్టికొట్టే ఉత్సవంలో విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: బెల్లుపడ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉట్టికొడుతున్న చిన్నారులు